
# సాక్షి
## నారాయణపేట

ఆదివారం । 19 । అక్టోబర్ । 2025





**ఉత్సవాలకు ఏర్పాట్లు**
కురుమూర్తిస్వామి బ్రహ్మోత్సవాలు, జాతరను వైభవంగా నిర్వహించేందుకు అధికారులు అన్ని ఏర్పాట్లు చేస్తున్నారు.
-10లో ▸



**ఉత్సాహంగా కిక్ బాక్సింగ్**
మహబూబ్‌నగర్‌లోని మల్టీపర్పస్ ఇండోర్ స్టేడియంలో అస్మితా ఖేలో ఇండియా వుమెన్స్ కిక్‌బాక్సింగ్ లీగ్ నిర్వహించారు.
-10లో ▸

గరిష్టం/కనిష్టం
32.8/19.6

**వాతావరణం**
ఆకాశం అప్పుడప్పుడు మేఘావృతం అవుతుంది. మధ్యాహ్నం ఎండ తీవ్రత ఉంటుంది. రాత్రిళ్లు చల్లని గాలులు వీస్తాయి.

# 227 దుకాణాలు.. 5,179 టెండర్లు

## మద్యం లైసెన్స్‌ల కోసం వ్యాపారుల్లో కనిపించని జోష్

- ఉమ్మడి జిల్లాలో గతంలో కంటే భారీగా తగ్గిన టెండర్లు
- అత్యధికంగా కోయిలకొండలో 50, కృష్ణాలో 42 దాఖలు
- జాతీయ రహదారి, సరిహద్దు ప్రాంతాల్లోనూ అంతంతే..
- చివరి రోజు 2,428 దరఖాస్తుల స్వీకరణ
- టెండర్ల ద్వారా రూ.155.37 కోట్ల ఆదాయం



మద్దూరు పరిధిలో ఉన్న దుకాణాలకు టెండర్లు వేస్తున్న వ్యాపారులు

**మహబూబ్‌నగర్ క్రైం:** సాధారణంగా మద్యం వ్యాపారం చేయాలన్నా కోరిక చాలా మందిలో ఉంటుంది.. దీంతో వైన్స్ దుకాణాలకు టెండర్లు వేయడంలో విపరీతమైన పోటీ నెలకొంటుంది. వేసిన టెండర్లలో వారి అదృష్టం పరీక్షించుకొని దుకాణాలు దక్కించుకోవాలనుకుంటారు. కానీ, ఈసారి జరిగిన టెండర్ల ప్రక్రియలో ఉమ్మడి జిల్లాలో ఆశించిన స్థాయిలో దరఖాస్తులు రాలేదని వచ్చిన లెక్కలు చెబుతున్నాయి. ప్రతి జిల్లాలో ఊహించని విధంగా టెండర్లు తగ్గడం ఆశ్చర్యం కలిగిస్తోంది. మద్యం వ్యాపారుల నుంచి దరఖాస్తులు స్వీకరించడానికి 23 రోజుల వ్యవధి ఇచ్చినా కూడా పెద్దగా ఆసక్తి చూపలేదు. దీనికితోడు స్థానిక ఎన్నికల్లో పోటీ చేయాలని భావించిన కొందరు దూరంగా ఉండటం ఒక కారణమైతే.. టెండర్ ఫీజు రూ.3 లక్షలకు పెంచడం కూడా ప్రభావం చూపింది.

**అర్ధరాత్రి 12 గంటల వరకు..**

ఉమ్మడి జిల్లాలోని 227 దుకాణాలకు గాను మొత్తం 5,179 టెండర్లు దాఖలు అయ్యాయి. ఇందులో శనివారం ఒక్కరోజే 2,428 దరఖాస్తులు రావడం విశేషం. చివరిరోజు కావడంతో దరఖాస్తులు తీసుకోవడానికి అర్ధరాత్రి 12 గంటల వరకు సమయం ఇవ్వడం వల్ల ఎక్సైజ్ అధికారులు ఆయా జిల్లా కేంద్రాల్లోని కలెక్టరేట్‌లలో అర్ధరాత్రి వరకు దరఖాస్తులు స్వీకరించారు. వీటి ద్వారా ప్రభుత్వానికి రూ.155.37 కోట్ల ఆదాయం సమకూరింది. ప్రస్తుతం వచ్చిన టెండర్లలో మహబూబ్‌నగర్ మొదటి స్థానంలో ఉండగా.. ఆ తర్వాత స్థానాల్లో నాగర్‌కర్నూల్, నారాయణపేట, గద్వాల, వనపర్తి జిల్లాలు ఉన్నాయి.

■ జాతీయ రహదారిపై ఉన్న దుకాణాలతోపాటు ఆంధ్ర, రాయలసీమ సరిహద్దు ప్రాంతాల్లో ఉన్న వాటికి సైతం ఈసారి టెండర్లు భారీగా తగ్గాయి. గతంలో జాతీయ రహదారి వెంట ఉన్న దుకాణాలకు చాలా వరకు డిమాండ్ ఉండేది. ఒక్కో దుకాణానికి వందల సంఖ్యలో దరఖాస్తులు వచ్చేవి. కానీ, ఈసారి పరిస్థితి చాలా వరకు తారుమారైంది. దీంతో గతంలో బాగా డిమాండ్ ఉన్న దుకాణాలకు సైతం టెండర్లు తగ్గాయి.




**జిల్లాల వారీగా పరిశీలిస్తే..**

2023లో ఒక్క మహబూబ్‌నగర్ జిల్లాలో 2,540 టెండర్లు రాగా.. ఈసారి 1,554 మాత్రమే వచ్చాయి. గతం కంటే ఈ ఏడాది 986 టెండర్లు తగ్గాయి. అదేవిధంగా మహబూబ్‌నగర్ సర్కిల్ పరిధిలో 2023లో 1,308 టెండర్లు వస్తే ఈసారి 780 వచ్చాయి. దాదాపు 528 టెండర్లు తగ్గాయి. జడ్చర్ల సర్కిల్ పరిధిలో గతంలో 1,232 టెండర్లు వస్తే ఈసారి 764 దాఖలయ్యాయి. ఇప్పుడు 468 తగ్గడం విశేషం. మహబూబ్‌నగర్ జిల్లాలో ప్రస్తుతం టెండర్ల ప్రక్రియలో కోయిలకొండలో ఉన్న 25వ దుకాణానికి అత్యధికంగా 50, అత్యల్పంగా హన్వాడలోని 22వ ఎస్సీ రిజర్వుడ్ దుకాణానికి 18 టెండర్లు వచ్చాయి. నారాయణపేట జిల్లాలో అత్యధికంగా కృష్ణలోని 73వ దుకాణానికి 42 టెండర్లు వస్తే అత్యల్పంగా..కొత్తపల్లిలోని 89వ దుకాణానికి 13 టెండర్లు రావడం విశేషం.

**ఉమ్మడి జిల్లాలో 2023, 2025లో వచ్చిన టెండర్లు ఇలా..**

| జిల్లా | చివరిరోజు టెండర్లు | టెండర్లు 2025 | టెండర్లు 2023 |
|---|---|---|---|
| మహబూబ్‌నగర్ | 671 | 1,554 | 2,540 |
| నాగర్‌కర్నూల్ | 750 | 1,423 | 2,524 |
| నారాయణపేట | 372 | 806 | 1,035 |
| జోగుళాంబ గద్వాల | 256 | 723 | 1,179 |
| వనపర్తి | 379 | 673 | 1,341 |
| మొత్తం | 2,428 | 5,179 | 8,619 |



జిల్లా కేంద్రంలో ఆర్టీసీ డిపోకు పరిమితమైన ఆర్టీసీ బస్సులు



మద్దూరులో బీసీ బంద్ సందర్భంగా తెరుచుకోని దుకాణాలు

# బీసీ బంద్ ప్రశాంతం

**ఆర్టీసీ డిపో వద్ద అఖిలపక్ష పార్టీల ఆధ్వర్యంలో ఆందోళన**

- ఎక్కడిబస్సులు అక్కడే నిలిచిన వైనం.. ప్రయాణికుల ఇబ్బందులు
- విద్యా సంస్థలు, వ్యాపార సముదాయాలు స్వచ్ఛంద బంద్



జిల్లా కేంద్రంలో మాట్లాడుతున్న మార్కెట్ చైర్మన్ ఆర్.శివారెడ్డి.. పాల్గొన్న అఖిలపక్షం నాయకులు

**నారాయణపేట:** స్థానిక సంస్థలలో బీసీలకు 42 శాతం రిజర్వేషన్ల సాధనే లక్ష్యంగా బీసీ జేఏసీ చేపట్టిన బంద్ నారాయపేట జిల్లాలో సంపూర్ణమైంది. శనివారం తెల్లవారుజాము నుంచే జిల్లా కేంద్రంలో బీసీ జేఏసీ నాయకులతో పాటు కాంగ్రెస్, బీఆర్ఎస్, వామపక్ష పార్టీల నాయకులు వేర్వేరుగా బంద్ చేయించారు. నారాయణపేట ఆర్టీసీ డిపో దగ్గరకు తెల్లవారుజామున అఖిలపక్షం నాయకులు చేరుకొని బస్సులు బయటికి రాకుండా గేట్ దగ్గర ధర్నా చేపట్టారు. దీంతో ఆర్టీసీ బస్సులు డిపోకు పరిమితం అయ్యాయి. పట్టణంలో విద్యా వ్యాపార వాణిజ్య సంస్థలు మూత పడ్డాయి. మక్తల్, కోస్గి, నర్వ, మరికల్, ధన్వాడ, ఊట్కూర్‌తోపాటు ఇతర మండలాల్లో బంద్ ప్రశాంతంగా ముగిసింది. బస్సుల రాకపోకలు నిలిచిపోవడంతో ప్రయాణికులు ఇబ్బందులు పడ్డారు. ఆయా ప్రాంతాల జేఏసీ నాయకులు బంద్‌లో భాగస్వాములు అయ్యారు.



మక్తల్‌లో బంద్‌లో బీఆర్ఎస్ నాయకులు

■ జిల్లా కేంద్రంలో మార్కెట్ చైర్మన్ రాంపురం శివారెడ్డి ఆధ్వర్యంలో కాంగ్రెస్ పార్టీ బంద్‌ను సంపూర్ణంగా చేపట్టారు. రిజర్వేషన్ల అంశాన్ని 9వ షెడ్యూల్‌లో చేర్చి చట్ట సవరణ చేయాలని ఆయన డిమాండ్ చేశారు. చట్ట బద్ధంగా చేసిన సవరణలను చూసి తెలంగాణకు బీసీ రిజర్వేషన్ ఇచ్చేలా కృషి చేయాలని ప్రధానిని కోరారు. ఈ సందర్భంగా కేంద్ర ప్రభుత్వం పై ఆయన మండిపడ్డారు.

■ బీజేపీ జిల్లా ఉపాధ్యక్షులు కెంచె శ్రీనివాసులు మాట్లాడుతూ బీసీ కులగలన సరిగా చేయకుండా బీసీలలో ముస్లింలను కలిపి పూర్తి తప్పులతో ఎలాంటి చిత్త శుద్ధి లేకుండా అడ్డగోలుగా బిల్లును తయారు చేసి గవర్నర్ కి పంపిందని విమర్శించారు. దాంతో న్యాయ స్థానాలతో చివాట్లు తింటూ.బీసీలను మోసం చేస్తుందని ధ్వజమెత్తారు.

## మద్దూరులో ఆసక్తికర ఘటన



మద్దూరు పాతబస్టాండ్ చౌరస్తాలో ధర్నా చేపట్టిన కాంగ్రెస్, బీఆర్ఎస్, బీజేపీ, వామపక్ష నాయకులు

**మద్దూరు:** బీసీ బంద్ నేపథ్యంలో మద్దూరులో శనివారం ఆసక్తికర సంఘటన చోటు చేసుకుంది. మొదట కాంగ్రెస్, వామపక్ష నాయకులు కలిసి పట్టణంలోని పాతబస్టాండ్ చౌరస్తాలో ధర్నా చేపట్టారు. కొద్ది సేపటికి బీఆర్ఎస్ నాయకులు నినాదాలు చేస్తూ ఇదే పాతబస్టాండ్ చేరుకొని మరో వైపు ధర్నా చేపట్టారు. ఈ క్రమంలో మధ్యలో ఉన్న ఖాళీ స్థలంలో బీజేపీ నాయకులు ధర్నాకు కూర్చున్నారు. ఈ మూడు పార్టీల నాయకులు పోటాపోటీగా నినాదాలు చేశారు. ఒకరిపై ఒకరు విమర్శలు చేసుకున్నారు. బీసీలకు రిజర్వేషన్లు కల్పించడంలో కాంగ్రెస్ ప్రభుత్వం చిత్తశుద్ధిలేదని బీఆర్ఎస్, బీజేపీలు ఆరోపించగా, అసెంబ్లీలో తీర్మానం చేసి పంపితే కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం రిజర్వేషన్ల అమలను అడ్డుకుంటుందని కాంగ్రెస్ నాయకులు ఆరోపించారు. ఒకానొక సమయంలో మూడు పార్టీ నాయకులు తీవ్ర స్థాయిలో నినాదాలు చేయడంలో పోలీసులు జోక్యం చేసుకొని ధర్నాను త్వరగా విరమించాలని సూచించారు. మొదట కాంగ్రెస్, వామపక్ష నాయకులు మాట్లాడి ధర్నా విరమించగా, తర్వాత బీఆర్ఎస్, బీజేపీ నాయకులు ధర్నాలను విరమించారు. దాదాపు రెండు గంటల పాటు జరిగిన ఈ ధర్నాలో.. బీసీ రిజర్వేషన్ల సాధన కోసం చేసినా ధర్నాలో తమ పార్టీల స్వలాభం కోసం మాత్రమే వచ్చాయని అక్కడి వచ్చిన వారు మాట్లాడుకోవడం విశేషం. కార్యక్రమంలో 4 పార్టీల నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

# డీసీసీ అధ్యక్షుడి ఎంపికకు సీఎం అభిప్రాయం



అభిప్రాయ సేకరణలో పాల్గొన్న ఏఐసీసీ పరిశీలకుడు నారాయణస్వామి, ఎమ్మెల్యేలు యెన్నం, జీఎంఆర్

- ఏఐసీసీ పరిశీలకుడు, ఎమ్మెల్సీ ఎం.నారాయణస్వామి

**స్టేషన్ మహబూబ్‌నగర్:** నారాయణపేట డీసీసీ అధ్యక్షుడి ఎంపిక కోసం స్వయంగా సీఎం రేవంత్ రెడ్డి అభిప్రాయాన్ని ఫోన్ ద్వారా తీసుకున్నామని ఏఐసీసీ పరిశీలకుడు, కర్ణాటకకు చెందిన ఎమ్మెల్సీ ఎం.నారాయణస్వామి అన్నారు. మహబూబ్‌నగర్ డీసీసీ అధ్యక్షుడి ఎంపికకు సంబంధించి శనివారం జిల్లాకేంద్రంలోని కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో మహబూబ్‌నగర్ అర్బన్ నాయకులు, కార్యకర్తల అభిప్రాయాలు సేకరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సంఘటన్ సృజన్ అభియాన్ ద్వారా కాంగ్రెస్ నాయకులు, పార్టీ ప్రతినిధుల అభిప్రాయాలతో డీసీసీ అధ్యక్షుడి నియామకంపై ఏఐసీసీ నేతృత్వంలో టీపీసీసీ ఆధ్వర్యంలో తుది నిర్ణయం ఉంటుందని, ఎవరూ ఎలాంటి అపోహలు లేకుండా అభిప్రాయాలు తెలియజేయాలని సూచించారు. ఎమ్మెల్యే యెన్నం శ్రీనివాస్‌రెడ్డి మాట్లాడుతూ సంఘటన్ సృజన్ అభియాన్ కార్యక్రమం ద్వారా దేశవ్యాప్తంగా కాంగ్రెస్ పార్టీ డీసీసీ అధ్యక్షుల నియామక ప్రక్రియ చేపట్టిందన్నారు. పంచాయతీ, మున్సిపల్, జెడ్పీ, మండల పరిషత్ ఎన్నికలు ముందున్నాయని, వీటిని దృష్టిలో పెట్టుకొని పార్టీని ఎవరు బలంగా ప్రజల్లోకి తీసుకెళ్లగలరో, ఎవరు డీసీసీ అధ్యక్షుడిగా ఉంటే పార్టీ పటిష్టంగా ఉంటుందో గ్రహించి వారి పేరును ఏఐసీసీ పరిశీలకులకు తెలియజేయాలన్నారు. అనంతరం ఏఐసీసీ పరిశీలకులు నాయకులు, కార్యకర్తల అభిప్రాయాలను తీసుకున్నారు. కార్యక్రమంలో డీసీసీ అధ్యక్షుడు, దేవరకద్ర ఎమ్మెల్యే జి.మధుసూదన్ రెడ్డి, టీజీఎంఎఫ్‌సీ చైర్మన్ ఒబేదుల్లా కొత్వాల్, పీసీసీ పరిశీలకులు సాయికుమార్, ఉజ్మా షాకీర్, ముడా చైర్మన్ లక్ష్మణ్ యాదవ్, మార్కెట్ కమిటీ చైర్‌పర్సన్ బెక్కరి అనిత, మున్సిపల్ మాజీ చైర్మన్ ఆనంద్‌గౌడ్, టీపీసీసీ ప్రధాన కార్యదర్శి సంజీవ్ ముదిరాజ్, అధికార ప్రతినిధులు హర్షవర్ధన్‌రెడ్డి, జహీర్ అఖ్తర్ తదితరులు పాల్గొన్నారు.

# అక్రమ కేసులతో గొంతునొక్కే కుట్ర

- 'సాక్షి'పై ఏపీ ప్రభుత్వం వేధింపులు మానుకోవాలి
- జిల్లాలో జర్నలిస్టు సంఘాల డిమాండ్




**నారాయణపేట:** ప్రజా సమస్యలను ఎత్తిచూపుతూ నిరంతరం అక్షర యజ్ఞం చేస్తున్న 'సాక్షి' పై ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం అక్రమ కేసులు బనాయించి గొంతునొక్కే కుట్ర చేస్తుందని.. పత్రికా స్వేచ్ఛను కాపాడాలని పాత్రికేయలోకం డిమాండ్ చేసింది. ఇటీవల కాలంలో ఏపీ కూటమి ప్రభుత్వం 'సాక్షి' పత్రిక ఎడిటర్‌తోపాటు జర్నలిస్టులపై అక్రమ కేసులతోపాటు వేధింపులకు గురిచేస్తున్న క్రమంలో పలువురు సంఘాల నాయకులు ప్రభుత్వ తీరుపై మండిపడుతున్నారు. సంస్థ కార్యాలయాల్లోకి చొరబడి నిర్బంధ విచారణ సాగించడం, తరచూ నోటీసులు జారీ చేస్తూ భయభ్రాంతులకు గురిచేయడం సరికాదన్నారు.

### కేసులతో భయపెట్టలేరు



వార్తల్లో ఏవైనా అభ్యంతరం ఉంటే సరైన ఖండన ఇచ్చే అవకాశం ప్రభుత్వానికి ఉంటుంది. అలా కాకుండా కేసులు పెట్టి మీడియాను భయపెట్టాలని చూడడం సరికాదు. పత్రికా స్వేచ్ఛకు భంగం కలిగిస్తే ఊరుకునేది లేదు. 'సాక్షి' ఎడిటర్‌పై పోలీసులు ప్రవర్తించిన తీరు సరికాదు. కక్ష సాధింపు చర్యలు ఇకనైనా మానుకోవాలి.

– కే.నారాయణరెడ్డి, టీయూడబ్ల్యూజే (ఐజేయూ) జిల్లా అధ్యక్షుడు

### ప్రజాస్వామ్యానికి గొడ్డలి పెట్టు



చంద్రబాబు ప్రభుత్వం కక్ష సాధింపు ధోరణిలో అక్రమ కేసులు పెట్టడం, వేధించడం తగదు. పత్రికా స్వేచ్ఛపై జరుగుతున్న దాడిగానే పరిగణించాల్సి ఉంటుంది. ఇలాంటి ఘటనలు ప్రజాస్వామ్యానికి గొడ్డలి పెట్టు వంటివి. ఏపీ ప్రభుత్వం, పోలీసులు వెనక్కి తగ్గకపోతే భవిష్యత్తులో ఉద్యమం చేపడతాం.

– హర్షద్ ఫైసల్, ఉర్దూ జర్నలిస్ట్ అసోసియేషన్ నాయకులు

### స్వేచ్ఛను హరిందచం తగదు



ప్రజా సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి వాటి పరిష్కారానికి కృషి చేస్తున్న పత్రికలపై ఏపీ ప్రభుత్వం కక్ష కట్టడం ప్రజాస్వామ్యానికి గొడ్డలిపెట్టు. అక్రమ కేసులు బనాయించి పోలీసులతో నిర్బంధించడం, జర్నలిస్టుల ఇళ్లల్లో తనిఖీలు చేస్తూ భయాభ్రాంతులకు గురిచేయడం తగదు. అనుకూలమైన వార్తలు రాయాలంటూ బెదిరించడం, మీడియాను తొక్కిపెట్టాలని ప్రయత్నాలు చేయడాన్ని వ్యతిరేకిస్తున్నాం.

– అవుటి రాజశేఖర్, టెంజు, జిల్లా అధ్యక్షుడు

### నియంత పోకడ..



'సాక్షి' ఎడిటర్, ఏపీ విలేకర్లపై అక్కడి పోలీసుల వేధింపులు తగదు. పత్రికలు సమాజంలో జరుగుతున్న వివిధ అంశాలను ప్రచురిస్తాయి. దీనిపై ప్రభుత్వానికి ఏమైనా అభ్యంతరాలు ఉంటే వివరణ ఇవ్వాలి. తప్పుడు కేసులు బనాయించి బెదిరించాలని చూడడం పత్రికా స్వేచ్ఛను హరించే విధంగా చంద్రబాబు అనుసరించడం సరికాదు. హిట్లర్, ముసోలిని వంటి నియంతల పోకడలను తలపిస్తుంది. ప్రభుత్వం కక్ష సాధింపు చర్యలు మానుకొని బాధ్యతగా వ్యవహరించాలి.

– ఆనంద్ కుమార్ గౌడ్, టీయూడబ్ల్యూజే (హెచ్ 143) జిల్లా అధ్యక్షుడు

### కక్ష పూరిత విధానాలు సరికాదు



ఏపీలో కూటమి ప్రభుత్వం ప్రజాస్వామ్యానికి సంకెళ్లు వేస్తోంది. కక్షపూరితమైన విధానాలు కొనసాగిస్తోంది. తన తప్పులను వెలికితీసేందుకు ప్రయత్నించే వారిని అక్రమంగా నిర్బంధిస్తోంది. పత్రికా విలేకర్లపై కేసులు నమోదు చేసి ఇబ్బందులకు గురి చేయడం.. దాడి చేయడం అమానుషం. భావప్రకటన స్వేచ్ఛకు సంకెళ్లు వేయడం సమంజసం కాదు. రాజ్యాంగం కల్పించిన స్వేచ్ఛను అడ్డుకోరాదు.

– లొట్టి శ్రీను, టీడబ్ల్యూజేఎఫ్ జిల్లా అధ్యక్షుడు

## డిగ్రీ కళాశాల నిర్మాణానికి రూ.6.10 కోట్లు

**ధన్వాడ:** స్థానిక డిగ్రీ కళాశాల నూతన భవన నిర్మాణానికి ప్రభుత్వం శనివారం రూ.6.10 కోట్లు మంజూరు చేసింది. గతేడాది ధన్వాడకు డిగ్రీ కళాశాల మంజూరైన విషయం తెలిసిందే. నూతన భవన నిర్మాణం కోసం కృషి చేసిన ఎమ్మెల్యే పర్ణికారెడ్డికి గ్రామస్తులు కృతజ్ఞతలు తెలిపారు.

## కురుమూర్తిస్వామి హుండీ లెక్కింపు

**చిన్నచింతకుంట:** మండలంలోని అమ్మాపురం గ్రామ సమీపంలో వెలసిన శ్రీకురుమూర్తిస్వామికి అమావాస్య, శని, సోమవారాలను పురస్కరించుకొని భక్తులు కానుకలుగా సమర్పించిన హుండీ డబ్బులను శనివారం ఆలయ సిబ్బంది లెక్కించారు. ఈ సందర్భంగా హుండీ ద్వారా రూ.4,48,248 ఆదాయం వచ్చినట్లు ఆలయ కమిటీ చైర్మన్ గోవర్ధన్‌రెడ్డి, ఈఓ మదనేశ్వర్‌రెడ్డి తెలిపారు. కార్యక్రమంలో కమిటీ సభ్యులు వెంకటేశ్వర్లు, భాస్కరచారి, కమలాకర్, నాగరాజు, అర్చకులు వెంకటయ్య తదితరులు పాల్గొన్నారు.

**భక్తులకు ఇబ్బందులు కలగకుండా బస్సులు నడిపిస్తాం**

**చిన్నచింతకుంట:** కురుమూర్తిస్వామి బ్రహ్మోత్సవాలు, జాతరకు వచ్చే భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా ఉమ్మడి పాలమూరు నలువైపుల నుంచి ప్రత్యేక బస్సులు నడిపిస్తామని ఆర్టీసీ రీజినల్ మేనేజర్ సంతోష్‌కుమార్ అన్నారు. స్వామివారి బ్రహ్మోత్సవాలను పురస్కరించుకొని శనివారం ఆలయం వద్ద బస్టాండ్ పరిసరాలు తదితర వాటిని పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కురుమూర్తి స్వామి ఆలయానికి వచ్చే భక్తులకు ఇబ్బందులు కలగకుండా చర్యలు తీసుకుంటామన్నారు. మహబూబ్‌నగర్ డీఎం సుజాత, సిబ్బంది తదితరులున్నారు.

# సీపీఆర్‌తో ప్రాణాలు కాపాడొచ్చు



మాట్లాడుతున్న ఎస్పీ వినీత్

**నారాయణపేట:** పోలీసు సిబ్బంది ఎల్లప్పుడు ప్రజలతో ప్రత్యక్షంగా పనిచేస్తారు.. అత్యవసర పరిస్థితుల్లో ప్రాణాలను రక్షించడానికి సిపిఆర్ పద్ధతులు తెలుసుకోవడం ఎంతో అవసరమని, సీపీఆర్ శిక్షణను సద్వినియం చేసుకోవాలని ఎస్పీ డాక్టర్ వినీత్ పోలీసులకు సూచించారు. శనివారం ఎస్పీ కార్యాలయంలోని కాన్ఫరెన్స్ హాల్లో లైఫ్ సేవర్ అసోసియేషన్ ఢిల్లీ వైద్య నిపుణుడు డాక్టర్ రాకేష్ సీపీఆర్ చేసే విధానంపై ప్రాక్టికల్‌గా జిల్లా పోలీసులకు అవగాహన కల్పించి వివరించారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ.. సీపీఆర్ అనేది అత్యవసర సమయంలో ఆస్పత్రికి వెళ్లేలోపు గుండె సమస్య ఉన్న, ఊపిరి పీల్చుకోవడానికి ఇబ్బందిగా ఉన్న వారికి ఎంతగానో ఉపయోగపడుతుందన్నారు. ఎక్కడైనా ఆపద వస్తే వెంటనే వెళ్లేది పోలీసులు ఆ తర్వాత 108 సిబ్బంది అని, ప్రతి ఒక్కరు సిపిఆర్ నేర్చుకుంటే తప్పకుండా ఒక ప్రాణాన్ని కాపాడిన వాళ్లం అవుతామని సూచించారు.

**అత్యవసర ప్రక్రియ..**

డాక్టర్ రాకేష్ మాట్లాడుతూ.. సీపీఆర్ అనేది ఛాతీ కుదింపులతో కూడిన అత్యవసర ప్రక్రియ అన్నారు. ఇది తరచుగా కృత్రిమ వెంటిలేషన్‌తో ఆకస్మిక రక్త ప్రసరణ, శ్వాసను పునరుద్ధరించడానికి చర్యలు తీసుకోబడుతుందని అన్నారు. డీఎంహెచ్‌ఓ జయచంద్ర మోహన్, విజయ్ కుమార్,ఆర్‌ఐ నరసింహ, ఎస్సైలు నరేష్, పురుషోత్తం పాల్గొన్నారు.

## క్లుప్తంగా

### గుమ్మకొండ తండాలో విషాదం



**తిమ్మాజిపేట:** మండల పరిధిలోని గుమ్మకొండ తండాకు చెందిన శంకర్ నాయక్ రోడ్డు ప్రమాదంలో గాయపడి చికిత్స పొందుతూ శుక్రవారం మృతి చెందాడు. శంకర్‌నాయక్ పనులు ముగించుకొని బైక్‌పై ఇంటికి తిరిగి వస్తుండగా ఓ వ్యక్తిని తప్పించబోయి ప్రమాదానికి గురయ్యాడు. వెంటనే చికిత్స నిమిత్తం ఎస్వీఎస్ ఆస్పత్రికి తరలించగా పరిస్థితి విషమించడంతో హైదరాబాద్‌లోని నిమ్స్‌కు తరలించారు. అక్కడి చికిత్స పొందుతూ మరణించడంతో శుక్రవారం రాత్రి శంకర్ నాయక్ మృతదేహాన్ని శనివారం తండాకు తీసుకురావడంతో కుటుంబ సభ్యులు, తండావాసుల రోదనలతో స్థానికంగా విషాదఛాయలు అలుముకున్నాయి. కాగా శంకర్ నాయక్ మరణవార్త తెలుసుకున్న మరికల్ చైటచెరువు తండాకు చెందిన రామునాయక్, మంజుల దంపతులు అంత్యక్రియల నిర్వహణకు గాను మృతుడి కుటుంబానికి రూ.5వేలు ఆర్థికసాయం అందజేశారు.

### డీసీఎం, కారు ఢీ: ఇద్దరి దుర్మరణం



మనీష్ (ఫైల్)



నాగరాజు (ఫైల్)

**వనపర్తి రూరల్:** ముందు వెళ్తున్న డీసీఎంను కారు ఢీకొట్టడంతో అందులో ప్రయాణిస్తున్న ఇద్దరు వ్యక్తులు మృతి చెందిన ఘటన శనివారం తెల్లవారుజామున పెబ్బేరు మండలంలోని జాతీయ రహదారిపై చోటుచేసుకుంది. ఎస్ఐ యుగేందర్‌రెడ్డి తెలిపిన వివరాల ప్రకారం.. కామారెడ్డికి చెందిన నాగరాజు (డ్రైవర్), కొంపల్లికి చెందిన మనీష్, విశాల్, రాజేష్ బ్యాండ్ మేళం వాయిస్తూ జీవనోపాధి పొందుతున్నారు. ఈ క్రమంలో వీరు బ్యాండ్ మేళం వాయించడానికి కర్నూల్‌కు వెళ్తున్నారు. మార్గ మధ్యలో పెబ్బేరు మండలంలోని జాతీయ రహదారిపై నందగోపాల్ హోటల్ సమీపంలోకి రాగానే తెల్లవారుజామున 3.30కు వీరి కారు ముందు వెళ్తున్న డీసీఎం సడన్‌గా బ్రేక్ వేయడంతో వెనక నుంచి బలంగా ఢీకొట్టారు. దీంతో నాగరాజు (24), మనీష్ (24) అక్కడికక్కడే మృతి చెందారు. విశాల్, రాజేష్‌కు తీవ్ర గాయాలయ్యాయి. క్షతగాత్రులను అంబులెన్స్‌లో వనపర్తి ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. మృతుడి తండ్రి జంగాల రాజేష్ ఫిర్యాదు మేరకు డీసీఎం డ్రైవర్‌పై కేసు నమోదు చేశామని ఎస్ఐ తెలిపారు.

### ట్రాక్టర్ ఢీకొని మహిళ మృతి

**ఊట్కూరు:** మండలంలోని నిడుగుర్తిలో శనివారం ఇంటి దగ్గర ట్రాక్టర్ ఢీకొని మహిళ మృతిచెందగా.. మరొకరికి తీవ్ర గాయాలైన ఘటన శనివారం చోటుచేసుకుంది. పోలీసుల కథనం ప్రకారం.. గ్రామానికి చెందిన అనంతమ్మ(55) అదే గ్రామానికి చెందిన కృష్ణారెడ్డి ఇంటికి పెరుగు కోసం వెళ్లింది. పెరుగు తీసుకొని కృష్ణారెడ్డి కూతురు మంజులతో మాట్లాడుతూ.. ఎదురుగా ఉన్న అరుగులపై కూర్చుంది. అప్పుడే పొలానికి వెళ్లేందుకు ఆంజనేయులు ట్రాక్టర్‌ను స్టార్ట్ చేయగా.. వేగంగా వెళ్లి ఇద్దరు మహిళలపై దూసుకెళ్లింది. అనంతమ్మ, మంజులకు తీవ్ర గాయాలు కాగా.. ఆస్పత్రికి తీసుకెళ్తుండగా అనంతమ్మ మృతిచెందింది. మంజుల కాలు విరిగింది. ఈ విషయమై మృతురాలి మేనల్లుడు రామకృష్ణారెడ్డి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ రమేశ్ తెలిపారు.

### పురుగు మందు తాగి.. వ్యక్తి బలవన్మరణం

**భూత్పూర్:** మండలంలోని పోతులమడుగుకు చెందిన ఖాసీం (48) చికిత్స పొందుతూ శనివారం మృతి చెందినట్లు ఎస్ఐ చంద్రశేఖర్ తెలిపారు. వివరాల్లోకి వెళ్తే ఖాసీం వ్యవసాయ కూలీగా పని చేసుకుంటూ కుటుంబాన్ని పోషించుకునేవాడు. గురువారం ఉదయం కోట్ల నారాయణ వ్యవసాయ పొలంలో పనికి వెళ్తున్నానని భార్య సుజాతతో చెప్పి వెళ్లాడు. ఖాసీం స్నేహితుడు జోగు చెన్నప్ప కూడా పనినిమిత్తం కోట్ల నారాయణ పొలం వద్దకు వెళ్లగా ఖాసీం చలికి వణుకుతున్న స్థితిలో కనిపించాడు. ఏమైందని ఆరా తీయగా ఆర్థిక పరిస్థితి బాగా లేకపోవడంతో పురుగు మందు తాగినట్లు ఖాసీం చెప్పాడు. దీంతో చెన్నప్ప వెంటనే కుటుంబ సభ్యులకు సమాచారం అందించగా ఆస్పత్రికి తరలించారు. పరిస్థితి విషమించడంతో ఖాసీం మృతి చెందాడు. మృతుడి భార్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

# కురుమూర్తి ఉత్సవాలకు ఏర్పాట్లు



రంగులు అద్ది ఉంచిన కురుమూర్తి స్వామి రాజగోపురం

- ఆలయ పరిసరాల్లో పనుల ముమ్మరం
- పూర్తిదశకు చేరుకున్న రంగులు అద్దడం
- మంచినీరు, పారిశుద్ధ్యంపై ప్రత్యేక దృష్టి

**చిన్నచింతకుంట:** కాంచన గుహలో కొలువుదీరిన కురుమూర్తి స్వామి బహ్మోత్సవాలు, జాతర ఈనెల 22 అంగరంగ వైభవంగా ప్రారంభం కానున్నాయి. ఉత్సవాలకు వచ్చే లక్షలాది మంది భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలుగకుండా ఉండేందుకు ఏర్పాట్లను అధికారులు ముమ్మరం చేశారు. అందుకు ఆలయం వద్ద వివిధ పనులు చేపట్టారు. పనులను పూర్తి చేసేందుకు రెండుమూడు రోజులుగా పనులను ముమ్మరంగా చేస్తున్నారు. ముఖ్యంగా అధికారులు పారిశుద్ధ్యం, మంచినీరు, ట్రాఫిక్ నియంత్రణ, పార్కింగ్, ప్రయాణ సౌకర్యాలు, వైద్యం, నిఘా ఏర్పాట్లపై దృష్టిసారించి అందుకనుగుణంగా పనులు చేపడుతున్నారు. అయితే ఇప్పటికే రంగులు అద్దే పనులు పూర్తి దశకు చేరుకోగా.. పారిశుద్ధ్య పనులపై ప్రత్యేక దృష్టి సారించారు. జాతర మైదానంలోని డ్రైనేజీల్లో జేసీబీల ద్వారా మురుగు, పిచ్చిమొక్కలను తొలగించారు. అన్నదాన సత్రం, కోనేరు వద్ద మరుగు దొడ్లు, మూత్రశాలలు, స్నానపుగదుల మరమ్మతులు చేపట్టారు. మంచినీటికి ఇబ్బందులు తలెత్తకుండా ఉండేదుకు తగు చర్యలు చేపడుతున్నారు.

### చేపట్టాల్సిన పనులు

భక్తుల ప్రయాణానికి బస్‌స్టాప్‌ల ఏర్పాటు, ట్రాఫిక్ నియంత్రణకు బారికేడ్లు, సీసీ కెమెరాలు, వైద్య, ఆరోగ్య కేంద్రాలకు ఏర్పాట్లు చేయాల్సి ఉంది. అందుకు ఆయా ప్రదేశాల్లో పారిశుద్ధ్య పనులు చేపట్టి చదును చేయాల్సి ఉంది. జాతర మైదానంలోని పలుచోట్ల నీటిగుంతలు పూడ్చాల్సి ఉంది. కొన్నిచోట్ల ఉన్న మరుగుదొడ్ల మరమ్మతులు చేపట్టాల్సి ఉంది. వాటికి ట్యాపులు బిగించాల్సి ఉంది. అయితే ఇంకా చేపట్టాల్సిన పనులను అధికారుల దృష్టికి తీసుకెళ్లగా.. త్వరలోనే పనులు ప్రారంభించి పూర్తి చేయనున్నట్లు తెలిపారు.

### పనులు పూర్తి చేస్తాం



స్వామివారి బ్రహ్మోత్సవాల సమయానికి అన్ని పనులు పూర్తి చేస్తాం. ఇప్పటికే ఆలయం వద్ద రంగులు అద్దే పనులు పూర్తి చేశాం. ఆలయ ప్రాంగణం, మెట్ల ప్రాంగణంలో పారిశుద్ధ్య పనులు చేపట్టి శుభ్రపరిచాం. జాతర మైదానంలో చేయాల్సిన పనులు చేపట్టి త్వరగా పూర్తి చేస్తాం.

– మధనేశ్వరెడ్డి, ఈఓ, కురుమూర్తిస్వామి ఆలయం

### ఇబ్బంది కలగకుండా ఏర్పాట్లు

కురుమూర్తి స్వామి బ్రహ్మోత్సవాలు, జాతర ఉత్సవాలకు తరలివచ్చే భక్తులకు ఇబ్బందులు కలుగకుండా అన్ని ఏర్పాట్లు చేస్తాం. ఇప్పటికే ఆలయం వద్ద వివిధ పనులు చేపట్టాం. ముఖ్యంగా మంచినీటి వసతి, పారిశుద్ధ్యం, ట్రాఫిక్ నింత్రణపై దృష్టిసారించి చర్యలు చేపడుతాం. బ్రహ్మోత్సవాల సమయానికి అన్ని పనులు పూర్తి చేస్తాం.

– గోవర్ధన్‌రెడ్డి, చైర్మన్, కురుమూర్తి స్వామి ఆలయం



రోడ్డుపై ఉన్న కమాన్‌కు రంగులు అద్దుతున్న కూలీలు



కేశ కండన శాల వద్ద డ్రైయినేజికి చేపట్టిన మరమ్మతు

# ఉత్సాహంగా మహిళా కిక్ బాక్సింగ్ లీగ్



క్రీడాకారిణులను పరిచయం చేసుకుంటున్న ఉమ్మడి జిల్లా ఒలింపిక్ సంఘం అధ్యక్షుడు ఎన్పీ వెంకటేశ్

**మహబూబ్‌నగర్ క్రీడలు:** చిన్నారులు చదువుతో పాటు క్రీడల్లో ప్రతిభచాటాలని ఉమ్మడి జిల్లా ఒలింపిక్ సంఘం అధ్యక్షుడు ఎన్పీ వెంకటేశ్ అన్నారు. జిల్లా కేంద్రంలోని మల్టీపర్పస్ ఇండోర్ స్టేడియంలో శనివారం జిల్లా స్పోర్ట్స్ కిక్‌బాక్సింగ్ అసోసియేషన్ ఆధ్వర్యంలో అస్మితా ఖేలో ఇండియా వుమెన్స్ కిక్‌బాక్సింగ్ లీగ్ నిర్వహించారు. ఈ లీగ్‌లో ఉమ్మడి జిల్లాతో వివిధ జిల్లాలకు చెందిన దాదాపు 150 మంది బాలికలు పాల్గొన్నారు. పోటీలను ఒలింపిక్ సంఘం అధ్యక్షుడు ఎన్పీ వెంకటేశ్ ముఖ్య అతిథిగా పాల్గొని ప్రారంభించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ చిన్నప్పటి నుంచి క్రీడలను ప్రాక్టిస్ చేయాలని తద్వారా ఉన్నతస్థాయికి చేరుకోవచ్చన్నారు. సెల్ ఫోన్‌కు దూరంగా ఉండి చదువు, క్రీడలపై దృష్టి పెట్టాలని కోరారు. మహబూబ్‌నగర్ క్రీడాపోటీల నిర్వహణకు ప్రత్యేక గుర్తింపు ఉందన్నారు. ఒలింపిక్ సంఘం కార్యదర్శి కురుమూర్తిగౌడ్ మాట్లాడుతూ క్రీడల్లో గెలుపు, ఓటములు సమానంగా స్వీకరించాలన్నారు. ఓడినవారు నిరాశ చెందకుండా మళ్లీ గెలుపు కోసం శ్రమించాలని కోరారు. డీవైఎస్ఓ శ్రీనివాస్ మాట్లాడుతూ ఆడపిల్లలను క్రీడల్లో ప్రోత్సహించడానికి ఖేలో ఇండియా కిక్‌బాక్సింగ్ సిటీ లీగ్ పెట్టడం జరిగిందన్నారు. క్రీడాకారుల్లో క్రమశిక్షణ చాలా ముఖ్యమని అన్నారు. రాష్ట్ర సంఘం అధ్యక్ష, కార్యదర్శులు రామాంజనేయులు, మహిపాల్ మాట్లాడుతూ తెలంగాణలోని ఐదు ప్రాంతాల్లో వుమెన్స్ కిక్‌బాక్సింగ్ లీగ్‌లు నిర్వహిస్తున్నామని, ఇందులో ప్రతిభచాటిన వారు త్వరలో జరిగే జోనల్ స్థాయి సెలక్షన్స్‌లో పాల్గొంటారని చెప్పారు. జోనల్ స్థాయిలో మెడల్స్ సాధించేవారు జాతీయస్థాయి పోటీలకు వెళ్తారని, నగదు పారితోషికాలు ఉంటాయన్నారు. నిరంతరం కిక్‌బాక్సింగ్ ప్రాక్టిస్ చేయాలని సూచించారు. కార్యక్రమంలో జిల్లా స్పోర్ట్స్ కిక్‌బాక్సింగ్ అసోసియేషన్ అధ్యక్ష, కార్యదర్శులు కె.రవికుమార్, రవినాయక్, భరత్, కనకం యాదవ్, శేఖర్, నర్సింగ్‌రావు, తిరుపతి, రాజు, శివ తదితరులు పాల్గొన్నారు.

### ఫలితాల వివరాలు..

పాయింట్ ఫైట్, లైట్, మ్యూజికల్ ఫాం విభాగాలు, టీం వెపన్, టీం కతాస్ విభాగాల్లో పోటీలు జరిగాయి. క్రియేటివిటీ ఫాంలో మహబూబ్‌నగర్ జట్టు భావన వర్షిణి, కె.క్రితిజ్ఞ, రిత్వికారెడ్డి ప్రథమ (మహబూబ్‌నగర్) ప్రథమ, శ్రీహిత, అవిశ్కృతి– ద్వితీయ (మహబూబ్‌నగర్), హార్డ్ స్టైల్ ఫాంలో రితిక ప్రథమ, గోమతి (ద్వితీయ), ఆరోహి (తృతీయ), మ్యూజికల్ ఫాంలో హారికారెడ్డి ప్రథమ, వర్షిణి ద్వితీయ స్థానాల్లో నిలిచారు.

### మాజీ సర్పంచ్ ఆత్మహత్య

**ఆత్మకూర్:** మండలంలోని గుంటిపల్లికి చెందిన మాజీ సర్పంచ్ నల్లగొండ కృష్ణ (40)ఆత్మహత్యకు పాల్పడ్డాడు. ఎస్ఐ నరేందర్ వివరాల మేరకు.. గుంటిపల్లికి చెందిన కృష్ణ ఈ నెల 15న మధ్యాహ్నం ఆత్మకూర్‌కు వెళ్లి వస్తానని చెప్పి ఇంటి నుంచి బయలుదేరాడు. అతడు ఎంతకూ తిరిగి రాకపోవడంతో కుటుంబ సభ్యులు బంధువుల వద్ద ఆరా తీశారు. అయినప్పటికీ అతడి ఆచూకీ లభించలేదు. శనివారం గ్రామ శివారులోని రాళ్లగుట్ట వద్ద చెట్టుకు ఉరివేసుకుని కృష్ణ ఆత్మహత్యకు పాల్పడినట్లు రైతులు గమనించి.. గ్రామస్తులు, పోలీసులకు సమాచారం అందించారు. అతడి ఆత్మహత్యకు గల కారణాలు తెలియాల్సి ఉంది. మృతుడి భార్య చెన్నమ్మ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు జరుపుతున్నట్లు ఎస్ఐ తెలిపారు.

# జూరాలకు నిలకడగా వరద

**ధరూరు:** ప్రియదర్శిని జూరాల ప్రాజెక్టుకు ఎగువ నుంచి వస్తున్న ఇన్‌ఫ్లో, అవుట్‌ఫ్లో నిలకడగా ఉన్నట్లు పీజేపీ అధికారులు తెలిపారు. శుక్రవారం రాత్రి 9 గంటల వరకు ప్రాజెక్టుకు 33 వేల క్యూసెక్కుల ఇన్‌ఫ్లో ఉండగా.. శనివారం రాత్రి 7 గంటల వరకు 32,200 క్యూసెక్కులకు చేరింది. జెన్‌కో జలవిద్యుత్ కేంద్రంలో మూడు యూనిట్లను కొనసాగించి విద్యుదుత్పత్తి చేస్తున్నారు. విద్యుదుత్పత్తి నిమిత్తం 19,561 క్యూసెక్కులు, ఆవిరి రూపంలో 47 క్యూసెక్కులు, నెట్టెంపాడు ఎత్తిపోతలకు 750 క్యూసెక్కులు, ఎడమ కాల్వకు 1,030 క్యూసెక్కులు, కుడి కాల్వకు 680 క్యూసెక్కులు, సమాంతర కాల్వకు 200 క్యూసెక్కులు, భీమా లిఫ్ట్–2కు 750 క్యూసెక్కులు ప్రాజెక్టు నుంచి మొత్తం 22,258 క్యూసెక్కుల నీటిని దిగువకు విడుదల చేస్తున్నారు. ప్రాజెక్ట్ పూర్తిస్థాయి నీటిమట్టం 9.657 టీఎంసీలు కాగా ప్రస్తుతం 9.439 టీఎంసీల నీటినిల్వ ఉన్నట్లు పీజేపీ అధికారులు పేర్కొన్నారు.

**శ్రీశైలంలో 882.5 అడుగుల నీటిమట్టం**

**దోమలపెంట:** శ్రీశైలం జలాశయంలో 882.5 అడుగుల వద్ద 202.0439 టీఎంసీల నీటినిల్వ ఉంది. జూరాలలో విద్యుదుత్పత్తి చేస్తూ 19,484, సుంకేసుల నుంచి 2,264 మొత్తం 21,748 క్యూసెక్కుల నీటి ప్రవాహం శ్రీశైలం జలాశయం వస్తున్నాయి. భూగర్భ కేంద్రంలో విద్యుదుత్పత్తి చేస్తూ 35,315 క్యూసెక్కుల నీటిని దిగువన సాగర్‌కు విడుదల చేస్తున్నారు. 24 గంటల వ్యవధిలో పోతిరెడ్డిపాడు ద్వారా 6,500, హెచ్ఎన్ఎస్ఎస్ లిఫ్ట్ ఇరిగేషన్ ద్వారా 747, ఎంజీకేఎల్ఐకు 1,333 క్యూసెక్కుల నీటిని విడుదల చేశారు. భూగర్భ కేంద్రంలో 16.989 మిలియన్ యూనిట్లు, ఏపీ జెన్‌కో పరిధిలోని కుడిగట్టు కేంద్రంలో 0.670 మి.యూనిట్ల విద్యుదుత్పత్తి చేశారు.

### లక్ష్యానికి మించి విద్యుదుత్పత్తి

**ఆత్మకూర్:** ప్రియదర్శిని జూరాల ప్రాజెక్టుకు ఎగువ కర్ణాటక రాష్ట్రం నుంచి వరద చేరుతుండడంతో దిగువ, ఎగువ జూరాల విద్యుత్ ఉత్పత్తి కేంద్రాల్లో లక్ష్యానికి మించి విద్యుదుత్పత్తి విజయవంతంగా కొనసాగుతుంది. ఈ మేరకు శనివారం 12 యూనిట్ల ద్వారా విద్యుదుత్పత్తి చేపట్టినట్లు ఎస్ఈ శ్రీధర్, డీఈ పవన్‌కుమార్ తెలిపారు. ఎగువలో 6 యూనిట్ల ద్వారా 234 మెగావాట్లు, దిగువలో 6 యూనిట్ల ద్వారా 240 మెగావాట్లు ఉత్పత్తి చేపడుతున్నారు. ఎగువ, దిగువ జల విద్యుత్ ఉత్పత్తి కేంద్రాల్లో ఇప్పటి వరకు 858.099 మిలియన్ యూనిట్ల విద్యుదుత్పత్తి చేసినట్లు తెలిపారు. జూరాల ప్రాజెక్టుకు పూర్తిస్థాయిలో వరద చేరుతుండటంతో 36 వేల క్యూసెక్కులను వినియోగించి విద్యుదుత్పత్తిని చేపడుతున్నట్లు పేర్కొన్నారు.

**రామన్‌పాడులో1,021 అడుగుల నీటిమట్టం**

**మదనాపురం:** మండలంలోని రామన్‌పాడు జలాశయంలో పూర్తిస్థాయి నీటిమట్టం సముద్రమట్టానికి పైన 1,021 అడుగులకు గాను 1,021 అడుగులకు చేరింది. జూరాల ఎడమ కాల్వ ద్వారా 1,030 క్యూసెక్కుల ఇన్‌ఫ్లో కొనసాగుతోంది. సమాంతర కాల్వ ద్వారా వచ్చే నీటిని నిలిపివేశారు. ఎన్టీఆర్ కాల్వ ద్వారా 875 క్యూసెక్కులు, కుడి, ఎడమ కాల్వ ద్వారా 55 క్యూసెక్కులు, వివిధ లిఫ్టుల ద్వారా 872 క్యూసెక్కులు తాగునీటి అవసరాలకు 20 క్యూసెక్కుల నీటిని వినియోగిస్తున్నట్లు ఏఈ వరప్రసాద్ తెలిపారు.

# తల్లిదండ్రులకు పాదపూజ



తల్లిదండ్రులకు పాదపూజ చేస్తున్న విద్యార్థులు

**అడ్డాకుల:** మండలంలోని కందూర్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో శనివారం విద్యార్థులు తమ తల్లిదండ్రులకు పాదపూజ నిర్వహించారు. వందేమాతరం ఫౌండేషన్ కోఆర్డినేటర్ రవీందర్‌రెడ్డి ఆధ్వర్యంలో మాతృపూజోత్సవం చేపట్టారు. ఈ సందర్భంగా పిల్లల భవిష్యత్ కోసం తల్లిదండ్రులు పడే తపనను ఆయన వివరించారు. హెచ్ఎం మురళీధర్, నిర్వాహకులు అనిల్ భగవత్, సంభూపాల్‌రెడ్డి, ఉపాధ్యాయులు శ్రీకాంత్ శర్మ, జనార్దన్‌రెడ్డి, చంద్రశేఖర్, విజయ్‌కుమార్, జయశ్రీ, శ్రీదేవి, గోపాల్, నాగమణి, అనిత పాల్గొన్నారు.

### తప్పుడు రిపోర్ట్‌తో పరువుపోయింది

న్యాయం చేయాలని ఆస్పత్రి ఎదుట ఆందోళన

**మహబూబ్‌నగర్ క్రైం:** ఆస్పత్రిలో పని చేసే సిబ్బందితో పాటు నిర్వాహకులు ఇచ్చిన తప్పుడు రిపోర్ట్ వల్ల తన భార్య తనను విడిచివెళ్లిపోయిందని ఆరోపిస్తూ ఓ బాధితుడు ఆస్పత్రి ఎదుట ఆందోళనకు దిగాడు. మహబూబ్‌నగర్‌లోని ఓ గ్యాస్ట్రో ఎంట్రాలజీ ఆస్పత్రిలోని ఉన్న సంతాన సాఫల్య కేంద్రానికి హన్వాడ మండలం బుద్దారం గ్రామానికి చెందిన ఓ వ్యక్తి పిల్లలు కావడం లేదని జూన్‌లో పరీక్షల కోసం వెళ్లారు. అతనికి అదే ఆస్పత్రిలో ఉన్న ల్యాబ్‌లో హెపటైటిస్ బీసర్ఫేస్ యాంటీజెన్(హెచ్‌బీఎస్ఏజీ) రక్త పరీక్షలు చేయగా దీంట్లో అతడికి పాజిటివ్ అని వచ్చింది. దీంతో అతని భార్య వదిలేసి పుట్టింటికి వెళ్లిపోయింది. ఆందోళనకు గురైన అతను జూలైలో హైదరాబాద్‌తో పాటు మహబూబ్‌నగర్‌లో ప్రైవేట్ డయోగ్నొస్టిక్ సెంటర్‌తో పాటు జనరల్ ఆస్పత్రిలో సైతం తిరిగి పరీక్ష చేయించుకోగా.. నెగిటివ్‌గా తేలింది. దీంతో గ్యాస్ట్రో ఎంట్రాలజీ ఆస్పత్రిలో తప్పుడు రిపోర్ట్ ఇచ్చారని, తన పరువు పోయిందని ఆరోపిస్తూ బాధితుడుతో పాటు కుల సంఘాల నాయకులతో కలిసి శనివారం ఆస్పత్రి ఎదుట ఆందోళన నిర్వహించారు. అనంతరం టూటౌన్ పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేయగా.. దీనిపై విచారణ చేస్తామని టూటౌన్ సీఐ ఇజాజుద్దీన్ వెల్లడించారు.

# వేలూరు రైల్వేస్టేషన్‌లో గట్టువాసులు



తమిళనాడులోని వేలూరు రైల్వేస్టేషన్‌లో ఉన్న గట్టు ప్రాంతవాసులు

**గట్టు:** మండలానికి చెందిన మూగవారు తప్పిపోయి తమిళనాడులోని వేలూరు రైల్వేస్టేషన్‌లో ప్రత్యక్షమయ్యారు. ఈ ప్రాంతానికి చెందిన ఓ దివ్యాంగుడు, మహిళ, ఇద్దరు పిల్లలను వేలూరులో రైల్వే పోలీసులు గుర్తించి, ఎక్కడి నుంచి ఎక్కడికి వెళ్తున్నారని.. ఏ ప్రాంతం వారని ఆరా తీసినట్లు సమాచారం. వారంతా మూగవారు కావడంతో అతికష్టం మీద వారి వివరాలను రైల్వే పోలీసులు గుర్తించే ప్రయత్నం చేశారు. అయితే తమది జోగుళాంబ గద్వాల జిల్లాలోని గట్టు ప్రాంతమని పేపర్‌పై రాసి ఇవ్వడంతో.. రైల్వే పోలీసులు శనివారం గద్వాల ఆర్డీఓకు సమాచారం అందించారు. ఈ మేరకు వేలూరు రైల్వే స్టేషన్‌లో కనిపించిన వారి ఫొటోలను గట్టు తహసీల్దార్ విజయ్‌కుమార్‌కు పంపించి.. గుర్తించాల్సిందిగా చెప్పారు. రెవెన్యూ అధికారులు సామాజిక మాధ్యమాలతో పాటు వివిధ గ్రామాలకు చెందిన మాజీ ప్రజాప్రతినిధులు, నాయకులకు వీరి ఫొటోలను ఫార్వర్డ్ చేశారు. వారు ఎవరనే విషయాన్ని తెలియజేయాలని అభ్యర్థించారు.

### ఎమ్మెల్యే ఫోన్ హ్యాక్

**దేవరకద్ర:** సైబర్ నేరగాళ్లు రోజురోజుకు రెచ్చిపోతున్నారు. సామాన్య ప్రజల నుంచి అధికారులు, రాజకీయ నేతల వరకు సెల్‌ఫోన్లు, సోషల్ మీడియా ఖాతాలను హ్యాకింగ్ చేసి దోచుకుంటున్నారు. తాజాగా దేవరకద్ర ఎమ్మెల్యే గవినోళ్ల మధుసూదన్ రెడ్డి ఫోన్‌ను హ్యాక్ చేశారు. శనివారం సైబర్ నేరగాళ్ల నుంచి తనకు వచ్చిన మెసేజ్‌ను పొరపాటున ఓపెన్ చేయడంతో ఫోన్‌తో పాటు సోషల్ మీడియా ఖాతాలు హ్యాకింగ్‌కు గురయ్యాయి. సైబర్ నేరగాళ్లు వాట్సప్ ద్వారా అన్ని గ్రూపులతో పాటు వ్యక్తిగత నంబర్లకు మెసేజ్‌లు ఫార్వర్డ్ చేశారు. ప్రస్తుతం తన యూపీఐ పని చేయడం లేదని, రూ. 85వేలు వెంటనే 96933 65397 నంబర్‌కు జీపీఏ చేయాలని కొందరికి పంపించగా.. మరికొందరికి రూ. 65వేలు పంపించాలని మెసేజ్‌లు పంపించారు. దేవరకద్ర నియోజకవర్గంలోని అన్ని మండలాల రాజకీయ నాయకులు, కార్యకర్తలతో పాటు విలేకర్లకు కూడా మెసేజ్‌లు రావడంతో అందరూ ఆశ్చర్యానికి గురయ్యారు. చాలా మంది ఎమ్మెల్యేకు ఫోన్‌చేసి విషయం తెలుసుకున్నారు. దీంతో అప్రమత్తమైన ఎమ్మెల్యే.. తన ఫోన్ హ్యాకింగ్‌కు గురైందని, ఎవరూ డబ్బులు పంపించొద్దని వాట్సప్ మెసేజ్ చేశారు. ఈ విషయంపై పోలీసులకు ఫిర్యాదు చేశారు.

# మనస్తాపంతో యువకుడి ఆత్మహత్య



మనోహర్(ఫైల్)

**బల్మూర్:** ప్రేమించిన యువతి అనారోగ్యంతో మృతి చెందడంతో మనస్తాపానికి గురైన యువకుడు ఉరి వేసుకోని ఆత్మహత్యకు పాల్పడిన ఘటన శనివారం మండల కేంద్రంలో జరిగింది. ఎస్ఐ రాజేందర్ తెలిపిన వివరాలు.. మండల కేంద్రానికి చెందిన పంజుగుల మనోహర్(24) ఐదేళ్లుగా ఆటో నడుపుతై జీవనం సాగిస్తున్నాడు. ఈ క్రమంలో తాను ప్రేమించిన యువతి ఇటీవల అనారోగ్యంలో మృతి చెందడంతో మనస్తాపానికి గురై ఐదు రోజులుగా ఇంటి వద్దే ఉంటున్నాడు. శుక్రవారం రాత్రి బాత్రూంకు వెళ్లి ఎంతకు బయటికి రాకపోవడంతో కుటుంబ సభ్యులు గమనించిగా ఉరి వేసుకోని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. కాపాడే ప్రయత్నం చేయగా అప్పటికే మృతి చెందినట్లు తెలిపారు. మృతుడి తల్లి సుల్తానమ్మ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ పేర్కొన్నారు.

### ఉరేసుకుని వ్యక్తి ఆత్మహత్య

**హన్వాడ:** మండల కేంద్రంలో ఓ వ్యక్తి ఆత్మహత్య చేసుకున్న ఘటన శనివారం ఉదయం వెలుగు చూసింది. పోలీసులు తెలిపిన కథనం మేరకు.. మండల కేంద్రానికి చెందిన కమ్మరి వెంకటేష్ (42) కొన్ని రోజులుగా కంటి సమస్యతో బాధపడుతున్నాడు. దీనికి తోడు అప్పులు కూడా పెరిగడంతో వాటిని తీర్చలేక మనోవేదనకు గురయ్యాడు. ఈ క్రమంలో ఇటీవలే కంటి ఆపరేషన్ కూడా చేయించుకున్నాడు. శుక్రవారం తాను నిర్వహిస్తున్న కార్పెంటర్ షాపునకు వెళ్లిన ఆయన తిరిగి రాత్రి ఇంటికి రాకపోవడంతో భార్య సుకన్య షాపు వద్దకు వెళ్లింది. ఆ సమయంలో వెంకటేష్ విద్యుత్ వైర్లతో ఉరేసుకుని మృతి చెందడాన్ని గుర్తించి, పోలీసులకు సమాచారం అందించింది. ఎస్ఐ వెంకటేష్ ఘటన స్థలానికి చేరుకొని మృతుడి భార్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని తెలిపారు. మృతుడికి భార్య, ఇద్దరు కుమారులు ఉన్నారు.

### వరకట్న వేధింపులు తాళలేక ఆత్మహత్య

**జడ్చర్ల:** వరకట్నం వేధింపులు తాళలేక వివాహిత ఆత్మహత్యకు పాల్పడిన ఘటన మండలంలోని శికార్‌గానిపల్లిలో చోటుచేసుకుందని సీఐ కమలాకర్ తెలిపారు. పోలీసుల కథనం ప్రకారం .. మండలంలోని శికార్‌గానిపల్లికి చెందిన మండ్ల శైలజ అలియాస్ గుడిసె లాస్య(27) శుక్రవారం ఇంట్లో ఎవరూలేని సమయంలో ఫ్యానుకు ఉరివేసుకొని ఆత్మహత్య చేసుకుంది. మృతురాలి భర్త మూసాపేట మండలం జానంపేటకు చెందిన వెంకటేశ్ కొంతకాలంగా అదనపు కట్నం కోసం వేధిస్తున్నాడని, ముగ్గురు కుమారులు అనారోగ్యానికి గురైనా ఏమాత్రం పట్టించుకోకపోవడంతో వరుసగా మృతిచెందారు. దీంతో లాస్య శికార్‌గానిపల్లిలోని తల్లి మండ్ల జయమ్మ వద్దకు వచ్చి ఉంటోంది. తనకు అదనంగా కట్నం ఇస్తేనే కాపురానికి తీసుకెళ్తానని భర్త చెప్పడంతో మనస్తాపానికి గురైన ఆత్మహత్యకు పాల్పడింది. ఆత్మహత్యకు కారకుడైన వెంకటేశ్‌పై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని లాస్య తల్లి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ తెలిపారు.

# నెట్టెంపాడు కాల్వలో పడిన యువకుడు



నెట్టెంపాడు ప్రధాన కాల్వలో పడిన యువకుడిని బయటకు తీస్తున్న పోలీసులు

**ధరూరు:** పొట్ట కూటి కోసం జాతరలో సర్కస్ చేసేందుకు వచ్చిన ఓ యువకుడు ప్రమాదశాత్తు నెట్టెంపాడు కాల్వలో పడి ప్రాణాలతో బయటపడిన ఘటన మండలంలోని గుడ్డెందొడ్డి శివారులో శనివారం చోటు చేసుకుంది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. కేటీదొడ్డి మండలంలోని పాగుంట లక్ష్మీవేంకటేశ్వర స్వామి బ్రహ్మోత్సవాల్లో సర్కస్ వేసేందుకు వచ్చిన కర్ణాటకలోని బీజాపూర్‌కు చెందిన తనాజీ అనే 25 ఏళ్ల యువకుడు వచ్చాడు. అతడు శనివారం మధ్యాహ్నం 2 గంటల సమయంలో మండలంలోని గుడ్డెందొడ్డి శివారులోని నెట్టెంపాడు ప్రధాన కాలువలో చేపల పట్టేందుకు వెళ్లాడు. పంప్‌హౌస్ సమీపంలోనే కాల్వ లోతుగా ఉందని తెలియని ఆ యువకుడు కాల్వలోకి దిగి జారిపడిపోయాడు. అక్కడే ఉన్న వారి బంధువైన మరో యువకుడు గట్టిగా కేకలు వేయడంతో చుట్టు పక్కల రైతులు, అటుగా వెళ్తున్న వాహనదారులు గమనించి ముందుగా రేవులపల్లి పోలీసులకు సమాచారం అందించారు. వారు ఫైర్ సిబ్బంది, రెస్క్యూ టీం సిబ్బందికి విషయం తెలిపారు. అందరూ కలిసి గంట పాటు శ్రమించి ఆ యువకుడిని తాళ్లు, నిచ్చెన సహాయంతో బయటకు తీశారు. ప్రాణాలకు తెగించి ఓ నిండు ప్రాణాన్ని కాపాడిన ఎస్ శ్రీహరి, గద్వాల ఫైర్ స్టేషన్ ఎస్ఐ రాకేష్, పోలీసులను గుడ్డెందొడ్డి మాజీ సర్పంచు రఘువర్ధన్‌రెడ్డి, సామాజిక కార్యకర్త అంజి సాగర్ శాలువాలతో సన్మానించారు. 10 అడుగుల దూరంలోనే పంప్ హౌస్ మోటారు రన్నింగ్‌లో ఉండడంతో అందులోకి జారుకునే ప్రమాదం ఉందని, పోలీసులు సమయానికి వచ్చి ప్రాణాలను కాపాడారని గుడ్డెందొడ్డి గ్రామస్తులు తెలిపారు. బాధితుడికి తల, చేతికి గాయాలవడంతో చికిత్స కోసం 108 అంబులెన్స్‌లో గద్వాల ఆస్పత్రికి తరలించారు.